

## విలువల పాత్ర

**సీసీటీవీ** కెమెరాలు వచ్చిన తర్వాత ప్రమాదాలు జరిగిన స్థలం దగ్గర పరిస్థితులు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. ఇవన్నీ కూడా 'బైస్టాండర్ ఎఫెక్ట్'ను పదేపదే రుజువు చేస్తున్నాయి. చైనాలోనూ ఇలాంటి ఓ సంఘటన జరిగింది. ఓ రెండేళ్ల పిల్ల మీదినుంచి వ్యాన్ వెళ్లిపోయినా, చుట్టుపక్కల వాళ్లు పట్టనట్టున్న సందర్భం తీవ్రమైన విమర్శలకు దారితీసింది. ఇదే సమయంలో అదే చైనాలో ఓ విదేశీయుడు స్పృహ తప్పి పడిపోతే, తనను కాపాడేందుకు అందరూ ముందుకు రావడం కనిపించింది. ఈ రెండు ఘటనల మధ్యా స్పందనల్లో వ్యత్యాసానికి కారణం ఏమిటా అని ఆలోచించినప్పుడు... అతిథులకు లోటు రాకుండా చూసుకోవాలనే సామాజిక విలువలే కారణం అని స్పష్టమైంది. తరాలుగా మనకు ఏదైతే మంచి అని చెబుతూ పెంచుతారో, ఏ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తారో... ఆ విలువల తాలూకు ప్రభావం 'బైస్టాండర్ ఎఫెక్ట్' మీద కచ్చితంగా ఉంటుందని అంటున్నారు. ఒకప్పుడు మనకు నీతి శతకాలు ఉండేవి, పెద్దల మాటలు వినిపించేవి, రోజువారీ మాటల్లో సూక్తులూ సామెతలూ దొర్లేవి, మోరల్ క్లాసెస్ పేరిట ప్రత్యేక తరగతులు ఉండేవి. కానీ ఇప్పుడు! కుటుంబాలు చిన్నబోయాయి, సంపాదనే సామర్థ్యానికి గీటురాయిగా మారింది, భౌతిక సంపదే విజయంగా భావిస్తున్నారు, సామాజిక విలువల్ని అసమర్థతగా అనుమానిస్తున్నారు. సాటి మనిషి ప్రమాదాన్ని ఓ చోద్యంగానో, సెల్ఫీ తీసుకునే సందర్భంగానో భావించడం వెనుక ఇవన్నీ ముఖ్య కారణాలే అంటున్నారు సామాజిక శాస్త్రవేత్తలు.



**పక్కవాళ్లను చూస్తూ..**

ఏదన్నా నేరం లేదా తప్పు జరుగుతున్నప్పుడు అక్కడి గుంపులో ప్రతి ఒక్కరూ కీలకంగా మారతారు. ఆ అనిశ్చితిలో ఒకరిని చూసి మరొకరు ప్రేరణ పొందుతారు. ఎవరూ ఏమీ మాట్లాడకపోతే.. తాము కూడా నిశ్శబ్దంగా ఉండిపోతే పోలా అనే భావన బలపడుతుంది. దీనికే Pluralistic ignorance అని పేరు.

**ప్రమాద తీవ్రత..**

పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటే... దాన్ని ఎదుర్కొనే ప్రయత్నం కూడా అంతే బలహీనంగా ఉంటుంది. ఇద్దరు గొడవపడుతున్నప్పుడు, ఒకరి చేతిలో కత్తి ఉంటే మధ్యలోకి వెళ్తే, మనకేం ప్రమాదమో అనే భయం సహజం. రోడ్డు ప్రమాదాల్లో చాలామంది క్షతగాత్రుల జోలికి పోకుండా ఉండటానికి ఇది కూడా ఓ కారణం. తనను రక్షించే ప్రయత్నంలో అనవసరంగా కోర్టులు, కేసుల చుట్టూ తిరగాల్సి వస్తుందనే అనుమానంతో చాలామంది చోద్యం చూస్తుంటారు.

**సామాజిక నేపథ్యం..**

తను అక్కడ నిలబడిన సమయంలో చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయన్న విషయం కూడా కొంత ప్రభావం చూపిస్తుంది. ఎవరున్నారు, ఎవరు ఏమనుకుంటారు అనే విశ్లేషణది కీలకపాత్ర. ఉదాహరణకు అంతా ఒకే సమూహానికి చెందిన వ్యక్తులైతే కలిసికట్టుగా ఎదుర్కోవాలనే ధైర్యం రావచ్చు!

**దాటేదెలా?**

సమస్య ఉందని తేలింది. దానికి కారణాలూ తెలిశాయి. కానీ, ఉపాయం తెలిస్తేనేగా ఉపయోగం. అందుకే ఈ ప్రేక్షక పాత్రలను తగ్గించేందుకు నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు కొన్ని మార్గాలు సూచిస్తున్నారు. వాటిలో ముఖ్యమైనవి...

- కళ్ల ముందు ఏదన్నా ప్రమాదమో, నేరమో జరుగుతున్నప్పుడు కంగారు సహజం. కాస్త మనసును చిక్కబట్టుకుని అసలు చుట్టూ ఏం జరుగుతున్నదో అంచనా వేసే ప్రయత్నం చేయాలి.
- ఎవరో ఒకరు ముందుకు వస్తారని ఎదురుచూసే ముందు... మనం ఆ పరిస్థితుల్లో ఏం చేయగలమో ఆలోచించాలి. పోలీసులకు లేదా అంబులెన్స్‌కు ఫోన్ చేయడమో, దగ్గర్లో ఉన్నవారి సాయం కోసం కేకలు వేయడమో... ఇలా ఏదో ఒక చిన్నాపెద్ద ప్రయత్నంతో ఆ పరిస్థితిలో ప్రమాదాన్ని వీలైనంత తగ్గించే ప్రయత్నం చేయాలి.
- ఒకవేళ ఎవరన్నా దాడి చేస్తున్నా, ఆత్మహత్య లాంటి ప్రయత్నాలు జరుగుతున్నా... తన దృష్టి మరల్చే ప్రయత్నం చేయాలి. అనునయించో, మాటల్లోకి దింపో ఆ ఉద్వేగం చల్లబరచాలి.
- ఈ క్షణం నేను ఏం చేయకపోతే ఓ ప్రాణం పోతుందనే స్పృహ తొందరపడేలా ప్రోత్సహిస్తుంది. అక్కడ ఉన్నది నా పరిచయస్తుడైతే ఏం చేస్తాను అనే ఆలోచన ఏదో ఒక చర్య తీసుకునేలా చేస్తుంది.
- ఒకరు అడుగు ముందుకు వేయడానికి భయం అయినప్పుడు అటూ ఇటూ ఉన్నవారిని కూడా కలుపుకొని నడిస్తే భయం పల్చబడుతుంది. చాలా సందర్భాలలో ఎవరో ఒకరు ముందుకు అడుగువేస్తే, వారిని అనుసరించేందుకు మిగతా వాళ్లు కూడా సిద్ధంగా ఉంటారు. గాలికి తేలే ఎండుటాకులలో ఒక్కటి అంటుకున్నా కార్చిచ్చు ఖాయం కదా!

అసలు ఈ బైస్టాండర్ ఎఫెక్ట్ అనే సిద్ధాంతం ఒకటి ఉంది. మన సాయానికి అడ్డుగా నిలుస్తున్నది అనే ఎరుకే చాలా ముఖ్యమంటున్నారు సామాజికవేత్తలు. అది తెలిసినప్పుడు, మనలో ఏర్పడిన స్తబ్దతను, దాని పర్యవసానాన్నీ గుర్తించగలుగుతామట. కాబట్టి ఈసారి అలాంటి పరిస్థితి ఏదైనా ఎదురైనప్పుడు, దాన్ని ఓ వినోదంగానో ప్రమాదంగానో కాకుండా సాయం చేసే సందర్భంగా మార్చుకుందాం.

